క్లుప్తంగా

11న ఆత్మీయ సమ్మేళనం

భూపాలపల్లి అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 11వ తేదీన హనుమకొండలో నిర్వహిస్తున్నట్లు, ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనిగాల కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రమాణ పత్రాల అందజేత



ప్రమాణ పత్రాలు అందుకున్న ప్రతినిధులు

భూపాలపల్లి అర్బన్ : నూతనంగా ఎన్నికైన సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) ప్రతినిధులకు బుధవారం ఏరియా జీఎం శ్రీనివాసరావు ప్రమాణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సీఎంఓఏఐ సంఘం ప్రతినిధులుగా ఎన్నికైన నాయకులు అధికారుల సంక్షేమం, సమస్యలను పరిష్కరించేందుకు సమష్టిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రాజేశ్వర్‌రావు

మహదేవపూర్ : మల్టీజోన్ బదిలీల్లో భాగంగా మహదేవపూర్ సర్కిల్ సీఐగా బోనాల రాజేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిసున్న సీఐ కిరణ్ ఖమ్మం జిల్లా సత్తుపల్లికి బదిలీపై వెళ్లారు. కాగా జయశంకర్ భూపాలపల్లిలో జిల్లా నేర పరిశీలన విభాగంలో (డీసీఆర్‌బీ)గా పనిజేస్తున్న రాజేశ్వర్‌రావును మహదేవపూర్‌కు బదిలీ చేయగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

కాటారం సీఐగా నాగార్జునరావు



కాటారం : కాటారం సీఐగా నాగార్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని సీటీసీలో విధులు నిర్వర్తిస్తున్న నాగార్జునరావును కాటారానికి బదిలీ చేస్తూ ఐజీ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగార్జునరావు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐని ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మొగుళ్లపల్లి : మండలంలోని ఇస్సీపేట వాగు నుంచి రెండు ట్రాక్టర్లు, పోతుగల్ వాగు నుంచి ఒక ట్రాక్టర్ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ తెలిపారు. ఇస్సీపేట వాగు నుంచి అదే గ్రామానికి చెందిన మేడిద ఆదిరెడ్డి, వాగొడ్డుపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్, పోతుగల్ వాగు నుంచి టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడుత అనిల్ తమ ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

మహాముత్తారం : మండలంలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నేడు(గురువారం) మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాగా ఈ శిబిరం ప్రారంభానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే హాజరవుతారన్నారు. పలిమెల, మహాముత్తారం మండలంలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరామర్శ

టేకుమట్ల : మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన యాదవ సంఘం సొసైటీ అధ్యక్షుడు బండారి ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బుధవారం మండల పశువైద్యాధికారి వివేక్ పరామర్శించారు. కుమారస్వామి, సంతు, శివకుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

పెసా గ్రామసభ

వెంకటాపురం(కె) : రామచంద్రాపురం, అంకన్నగూడెంల్లో బుధవారం ఇసుక రీచ్ నిర్వహణకు పెసా గ్రామసభలు నిర్వహించారు. అంకన్నగూడెం ఇసుక రీచ్ నిర్వహణను పంచాయతీ అధికారి సర్వర్ అధ్యక్షతన ఉదయం పాఠశాల ఆవరణంలో చేపట్టారు. కాగా అంకన్నగూడెం ఇసుక రీచ్ నిర్వహణను సిద్ధి వినాయక సొసైటీకి, పూజారిగూడెం ఇసుక రీచ్‌ను సమ్మక్క–సారలమ్మ సొసైటీకి అప్పగించాలని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



పలిమెల: ర్యాలీలో పాల్గొన్న ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి



కాటారంలో ర్యాలీలో ఎంపీపీ, ప్రత్యేకాధికారి, సిబ్బంది



రేగొండలో..



మల్హర్ : మల్లారంలో..



టేకుమట్ల: రోడ్లను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు తదితరులు

టేకుమట్ల : గ్రామ స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. కాగా మండలంలోని వెల్లంపల్లిలో చేపట్టిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛత నెలకొల్పే విధంగా ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ అనిత, నాయబ్ తహసీల్దార్ భాస్కర్, ఎంపీఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, ఒరగంటి శేఖర్, చింతలపల్లి స్వామిరావు, కృష్ణారెడ్డి, శాస్త్రాల కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ : ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సురేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో బుధవారం పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలను గుర్తించారు. మండల ప్రత్యేక అధికారి శామ్యూల్, ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎంపీఓ రామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. సైడు కాల్వల్లోని మట్టిని తొలగించి వర్షపు నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలు ఉన్నచోట మొరంతో నింపాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పలిమెల : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి గ్రామప్రజలకు సూచించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముకునూర్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు గుర్తించి రోజువారి కార్యక్రమంలో భాగంగా పనులు చేసేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జీపీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

కాటారం : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో బుధవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి సిబ్బందితో కలిసి జీపీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అవగాహన ర్యాలీలు చేపట్టారు. అనంతరం శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా వారం రోజుల పాటు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ఆయా జీపీల ప్రత్యేకాధికారులు సిబ్బందికి అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంస్థలు, రోడ్డుకు ఇరువైపుల గల పిచ్చి మొక్కలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేశారు. తాగునీటి సరఫరా, డ్రెయినేజీల నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం పట్ల జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న బావులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ ఉపేంద్రయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, ఉమాదేవి, కరుణాకర్, రజిత, పలు శాఖల గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

మల్హర్ : మండలంలోని మల్లారం, కొయ్యూరు, వల్లెకుంట తదితర గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాక్రమాలకు ప్రత్యేకాధికారులు శ్రీకారం చుట్టారు. ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అధికారులు గ్రామల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నారు. కాగా అధికారులు గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులను గుర్తిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లను శుభ్రం చేయడం, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టనున్నట్లు ప్రత్యేకాధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు సుధాకర్, విక్రమ్‌కుమార్, అశోక్, కార్యదర్శులు రాజు, ప్రసాద్, నరేష్, ఎంపీటీసీ నాగరాణి, పీఏసీఎస్ డైరెక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

మంగపేట : క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య అన్నారు. మండలంలోని చుంచుపల్లి(చెంచుపల్లి)లో ఈనెల 4 నుంచి కొమురం భీం యూత్, కొమురం అబ్బయ్య ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల స్థాయి సమ్మక్క–సారక్క వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సూర్య హాజరై షీల్డులు అందజేశారు. పోటీలలో రెండు జిల్లాల నుంచి మొత్తం 120 జట్లు తలపడ్డాయి. నాలుగు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన క్రీడా పోటీల్లో నాలుగు జట్లు విజేతలుగా నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం నర్సాపురం జట్టుకు షీల్డుతో పాటు రూ.20,000 నగదును అందజేసి క్రీడాకారులను అభినందించారు. అదే విధంగా రెండో స్థానంలో నిలిచిన భద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం పద్మాపురానికి చెందిన జట్టుకు బహుమతిగా షీల్డు, రూ.15,000 నగదు, మూడో స్థానంలో నిలిచిన ములుగు జిల్లా వాజేడు మండలం పెనగోలుకాలనీకి చెందిన జట్టుకు షీల్డ్ రూ.10,000 నగదు, నాలుగోస్థానంలో నిలిచిన మండలంలోని చుంచుపల్లి జట్టుకు బహుమతిగా షీల్డ్ రూ.5,000 నగదును అందచేశారు. అనంతరం సూర్యను చుంచుపల్లి మాజీ సర్పంచ్ కోరం నాగమణి, అబ్బయ్య దంపతులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల నాయకులు కోడం బాలకృష్ణ, పీఈటీ కొమురం రవికుమార్, నీరజ్‌కుమార్, వినోద్‌కుమార్, దబ్బగట్ల ప్రసాద్, కొర్నిబెల్లి గణేష్, కొమురం భీం యూత్ సభ్యులు సోలం సందీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

వాజేడు : డ్రైవింగ్ సమయంలో వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని పేరూరు ఎస్సై రమేష్ అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవంలో భాగంగా ప్రజలకు, వాహన యజమానులకు, యువకులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడుపొద్దని, మైనర్లు వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, స్పీడ్ డ్రైవింగ్, రహదారిపై సర్కస్ ఫీట్లు చేయడం, అతివేగంగా నడపడం, ఆటోలు, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకు వెళ్తే జరిగే పరిణామాలను ఆయన వివరించారు.

ఉపాధి కూలీలు హాజరయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం : గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనులపై బుధవారం ఎంపీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి కూలీలను మొబిలైజ్ చేసి 100 శాతం పనులు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. నాటిన మొక్కలు బతికే విధంగా చర్యలు తీసుకుంటూ సమయానికి వాటరింగ్ చేయాలని ప్రత్యేకంగా వాచర్‌లను నియమించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'సేవ చేయడం అదృష్టం'

ములుగు రూరల్ : గ్రామస్తులకు సేవచేయడం అదృష్టంగా భావించానని మహ్మద్‌గౌస్‌పల్లి మాజీ సర్పంచ్ గోల్కొండ శైలజసురేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానికులు సర్పంచ్ దంపతులతో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దామన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా గుర్తింపు తీసుకు వచ్చామని అన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉస్మాన్, మాజీ ఉపసర్పంచ్ తిప్పారపు కవిత–కిషన్, మాజీ వార్డు సభ్యులు రాజన్న, లక్ష్మి, రవి, సాంబయ్య, అనూష, చిరంజీవి, నాయకులు ప్రశాంత్, మొగిలి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో యూత్ నాయకులు

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు, వెలిశాల నవ చైతన్య ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గర్మిళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసారపు వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు వార్షిక, ఐదోతరగతి విద్యార్థులు గురుకుల పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నందున వారి కోసం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోను పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సైతం తోడ్పాటునందిస్తామన్నారు. అలాగే నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం ముఖ్య సలహాదారులు దాసారపు సదానందం, పంచాయతీ కార్యదర్శి బొమ్మ శ్రీకాంత్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, నవ చైతన్య ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మనం ఫౌండేషన్ సభ్యులు, లెక్చరర్లు

ఏటూరునాగారం : ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని మనం వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు చౌలం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వై జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు స్పోర్ట్స్ స్కూల్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి మనం ఫౌండేషన్ సభ్యులు ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలన్నారు. ఎవరూ కూడా ప్లాస్టిక్‌ను వాడొద్దని అవగాహన కల్పించారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలన్నారు.కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి పెద్దల నరేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న, లెక్చరర్లు ఘన్‌సింగ్, రవీందర్, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజారాం, రమణ, ఉపాధ్యాయులు తోసీఫ్, రవీందర్, సంపత్, రమేష్, రాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై చేయి చేసుకున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని నవాబుపేటకు చెందిన యువకుడు పప్పు సురేష్‌పై అన్యాయంగా పోలీసులు చేయి చేసుకున్నట్లు బాధితుడు తెలిపాడు. నవాబుపేట గ్రామంలోని చలివాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వాహనాన్ని అడ్డగించి డయల్–100కు ఫోన్ చేసినందుకు తనపై పోలీసులు చేయి చేసుకున్నారని బాధితుడు బుధవారం తెలిపాడు. ఫిర్యాదు ఎందుకు చేశావని తనపై చేయి చేసుకోవడమే కాకుండా మొబైల్ తీసుకున్నారని పేర్కొన్నాడు. అంతే కాకుండా అక్కడి నుంచి ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను పోలీసులు వదిలేశారని సురేష్ చెప్పాడు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా యువకుడు తప్పతాగి డయల్–100 కు పదే పదే ఫోన్ చేయడం జరిగిందని, సంఘటన స్థలానికి వెళ్లాము, కాని ఎవరిపై చేయి చేసుకోలేదన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఏటూరునాగారం: బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ములుగు రూరల్: మల్లంపల్లిలో..



మంగపేటలో బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మల్లంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్ల అనిల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మల్లంపల్లిలోని జాతీయ రహదారిపై బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఓడించడం జీర్ణించుకోలేక బాల్క సుమన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. సుమన్‌పై కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోల్కొండ రాజు, శ్రీకాంత్‌రెడ్డి, అజయ్, శ్యాం రావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

ఏటూరునాగారం : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బాల్క సుమన్, విజయసాయిరెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. అనంతరం రఘు మాట్లాడారు. కేసీఆర్ గడీలో బానిస బాల్క సుమన్ అని, కేసీఆర్ మోచేతి నీళ్లు తాగుతూ డ్రామారావు చెప్పినట్లు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసి బాల్క సుమన్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా తరిమికొట్టడం ఖాయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయసాయిరెడ్డి తెలంగాణలో ఉన్న ప్రజాప్రభుత్వం కూలిపోతుందని చెప్పడం అవివేకం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, లాలయ్య, ఎల్లయ్య, ఆయూబ్, ఖలీల్, నర్సింగరావు, రంజిత్, కిషోర్, భాగ్య, గౌస్, శ్రీనివాస్, వీసం నర్సయ్య, వంగపండ్ల రవి, సిరాజ్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

మంగపేట : మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేసి నిరసన తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపు మేరకు మండల కేంద్రంలో ఆ పార్టీ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి హాజరై మాట్లాడారు. బాల్క సుమన్ కేసీఆర్ గడీలో బానిస అని కేసీఆర్ మోచేతి నీళ్లు తాగుతూ డ్రామారావు చెప్పినట్లు చేసే బానిస అని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌తోపాటు తెలంగాణ ప్రజా ప్రభుత్వం కూలిపోతుందని యావత్ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జయరాంరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, సెక్రటరీ తూడి భగవాన్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి కాటబోయిన నర్సింహారావు, యూత్ ప్రధాన కార్యదర్శి కోడెల నరేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, నాయకులు మండవ రామకృష్ణ, పాడెం నాగేష్, ఎట్టి సారయ్య, బండపల్లి నర్సయ్య గౌడ్, పందిరి మోహన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్ జయంతి



మహదేవపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతా రమాబాయిఅంబేడ్కర్ జయంతిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కాలనీలో పసుల శంకర్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సామాజిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రమేశ్, రజిత పరుశరాములు, మున్నయ్య, రాజేందర్, రవీందర్, అస్రా, ఇమ్రాన్, పాఠశాల ఉపాధ్యాయులు శరత్, మల్లేషం, అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.